PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 72 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 10 మార్చి 2026

## సాగు నీరు సరఫరాపై పర్యవేక్షణ


3లో

## ఇల్లు లేక కష్టాల్లో మొగిలి...
## ప్రొసిడింగ్ కాపీ వరకే ఆగిన ఇల్లు కల


3లో

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్



**న్యూఢిల్లీ,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా మిగతా2లో...

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై మిగతా2లో...



## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు
# ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రాలు అందచేత

**హైదరాబాద్,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం మిగతా2లో...

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


2లో

# ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

- ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా
- దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు



**లెబనాన్, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారి కంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హుస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ మిగతా2లో...

# కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..
- కవిత సహా 23 మందికి నోటీసులు


2లో

## రైతుబంధు పథకం బంద్...
# రాహుల్ బంద్ స్టార్

- సిఎం రేవంత్‌పై కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు



**రాజన్నసిరిసిల్ల,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా మిగతా2లో...

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



**ఖమ్మం,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ మిగతా2లో...

# తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

- అందుబాటులో తయారీకి కావాల్సినంత నెయ్యి
- తప్పడు ప్రచారాలను ఖండించిన టిటిడి



**తిరుమల,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి నిల్వలు సరిపడా ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి బోర్టు స్పష్టం చేసింది. తితిదే వద్ద నెయ్యి నిల్వలు సరిపడా లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని ఇటీవల కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడంపై తితిదే స్పందించింది. ఇలా అసత్య ప్రచారం చేయడం సరికాదని తితిదే పేర్కొంది. లడ్డూల తయారీకి మిగతా2లో...

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు
# ఘనంగా వీడ్కోలు


2లో

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకు రండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**హైదరాబాద్,మార్చి 9 (పిసిడబ్ల్యు న్యూస్):** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కవితకు మళ్లీ నోటీసులు!

**న్యూఢిల్లీ,మార్చి 9 (పిసిడబ్ల్యు న్యూస్):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోం ది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడు పులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాది స్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# సీఈసీపై అభిశంసన.. తీర్మానానికి సిద్ధమవుతున్న విపక్షాలు

- ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశం



**న్యూఢిల్లీ,మార్చి 9 (పిసిడబ్ల్యు న్యూస్):** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నెయ్యి కొనుగోలు విధానం మూడంచెలుగా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతోంది. అందుకు తితిదే ముందుస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తితిదే వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దు' అని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

# రైతుబంధు పథకం బంద్...రాహుల్ బంద్ స్టార్

(మొదటి పేజీ తరువాయి)

సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్,మార్చి 9 (పిసిడబ్ల్యు న్యూస్):** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాను అందజేసి వీడ్కోలు పలికారు. వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# ఇల్లు లేక కష్టాల్లో మొగిలి...
# ప్రొసిడింగ్ కాపీ వరకే ఆగిన ఇల్లు కల



**పరకాల, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం 8వ వార్డుకు చెందిన పేద కుటుంబం జనగం మొగిలి గౌడ్ ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వ కాలంలో పేదలకు ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీతో తనకు కూడా ఇల్లు మంజూరు అవుతుందని ఆశపడ్డానని, అయితే అధికారుల నుంచి ప్రొసిడింగ్ కాపీ వరకే వచ్చి ఆగిపోయిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారినా ఇప్పటి వరకు తనకు ఇల్లు మంజూరు కాలేదని వాపోయాడు. సీతారాంపురం గ్రామంలో తాను నిజమైన పేదవాడినని ఎవరిని అడిగినా చెబుతారని, అయినప్పటికీ అర్హత ఉన్నప్పటికీ తనకు ఇల్లు రాకపోవడం బాధాకరమని మొగిలి తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించినప్పటికీ, గ్రామంలో ఇప్పటికే మంచి ఇళ్లు, బంగ్లాలు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని ఆరోపించారు. నిజంగా ఇల్లు అవసరమైన తనలాంటి పేదలకు మాత్రం పథకం అందకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు లేకపోవడంతో కుటుంబంతో కలిసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని మొగిలి కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు తన పరిస్థితిని గుర్తించి అర్హులైన పేదవాడిగా తనకు కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు. ప్రభుత్వ పథకాలు నిజమైన పేదల వరకూ చేరేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. అదేవిధంగా కొంతమంది స్థానిక నాయకులు "నీ ఇంట్లో మహిళ లేదు.. అందుకే ఇందిరమ్మ ఇల్లు రాలేదు" అని హేళన చేశారని మొగిలి బాధతో తెలిపారు. ఆ మాటలు తనను మరింత మానసికంగా కలిచివేశాయని, పేదవాడినని తక్కువగా చూడకుండా తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటూ మీడియా ఎదుట బోరున విలపించాడు. సీతారాంపురం గ్రామంలో పేదల పరిస్థితిని అధికారులు పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని స్థానికులు కూడా అభిప్రాయపడుతున్నారు. నిజంగా ఇల్లు అవసరమైన కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ములుగు రైస్ మిల్లర్ల నిరసన కలెక్టర్‌కు వినతి








**ములుగు,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో జిల్లా రైస్ మిల్లర్లు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను వివరించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు మరియు ప్రభుత్వానికి మధ్య కీలకమైన వారధిగా పనిచేస్తున్న రైస్ మిల్ పరిశ్రమ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు, విద్యుత్ చార్జీలు, గోదాముల కొరత, ధాన్యం నాణ్యత సమస్యలు వంటి కారణాలతో మిల్లర్లు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా 2019–20 కరోనా కాలంలో ప్రభుత్వం భారీగా ధాన్యం కేటాయించడంతో చాలా రైస్ మిల్లులు సమయానికి సిఎంఆర్ బియ్యం అందించలేకపోయాయని తెలిపారు. హమాలీలు, గోదాముల కొరత వంటి సమస్యల కారణంగా ధాన్యం ఎక్కువకాలం నిల్వ ఉండి నాణ్యత దెబ్బతిన్నదని, దీంతో మిల్లర్లు ఆర్థికంగా నష్టపోయారని వివరించారు. అప్పట్లో ధాన్యం మద్దతు ధర రూ.1835 ఉండగా ప్రస్తుతం 2025–26 నాటికి అది రూ.2389కు పెరిగిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో డిఫాల్ట్ మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అందించాలంటే అదనంగా లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. దీనికి తోడు ప్రభుత్వం విధించిన 25 శాతం పెనాల్టీ మరియు 12 శాతం వడ్డీ మిల్లర్లపై మరింత ఆర్థిక భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడో వంతు రైస్ మిల్లులు డిఫాల్టర్లుగా మారిన పరిస్థితి నెలకొన్నదని వారు పేర్కొన్నారు. మిల్లర్లకు ప్రభుత్వం నుంచి రావలసిన మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, డ్రైయేజ్ చార్జీలు, కస్టోడియన్ చార్జీలు కూడా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ మరియు 12 శాతం వడ్డీని మాఫీ చేసి, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని నాలుగు వాయిదాల్లో చెల్లించే విధంగా అవకాశం కల్పించాలని ప్రభుత్వం ను కోరారు. రైస్ మిల్ పరిశ్రమ రైతులకు మద్దతుగా నిలుస్తూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కీలక రంగమని, ఈ రంగం క్షీణిస్తే రైతులు, కార్మికులు, రవాణా రంగం వంటి అనేక రంగాలు ప్రభావితమవుతాయని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం మిల్లర్ల సమస్యలను పరిగణలోకి తీసుకొని తక్షణమే అనుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల సంఖ్య పెంపుపై
# ప్రభుత్వానికి ప్రతిపాదించాం...

- డీజేఎస్తో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్రెడ్డి.
- జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టుకు స్థానంపై పరిశీలిస్తం.
- ఫీల్డ్, డెస్క్ అనే తేడా లేకుండా మహిళలకు 33 శాతం కోటా ఉంటుందని వెల్లడి.
- రెండోసారి బాధ్యతలు చేపట్టిన చైర్మన్కు డీజేఎస్ అభినందనలు.



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,మార్చ్9(పీసీడబ్ల్యూ న్యూస్):** మనమంతా వర్కింగ్ జర్నలిస్టులమని డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులు అనే తేడాలు ఏమీ ఉండవని అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్రెడ్డి అన్నారు. డెస్క్ జర్నలిస్టులకు కార్డుల సంఖ్య పెంచడం సహా రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ మొదటి మీటింగ్లో చర్చకు వచ్చిన పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్, డీజేఎస్ ప్రతినిధులు డెస్క్ జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతపత్రం అందజేసి వాటిని పరిష్కరించాల్సిందిగా కోరారు. సెంట్రల్ డెస్కు, జిల్లాల డెస్కుల్లో పనిచేసే జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల సంఖ్య పెంచాలని కోరగా స్పందించిన శ్రీనివాస్రెడ్డి ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని.. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీలో డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధికి స్థానం కల్పించినట్టుగానే జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో కూడా డెస్క్ జర్నలిస్టులకు స్థానం కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంపై ఐ అండ్ పీఆర్ అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అలాగే ఫీల్డ్, డెస్క్ అనే తేడా లేకుండా అక్రెడిటేషన్ కార్డుల జారీలో మహిళా జర్నలిస్టులకు 33 శాతం కోటా వర్తింపజేయాలని కోరాగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు ప్రస్తుతం జారీ చేయనున్న అక్రెడిటేషన్ కార్డుల సంఖ్యకు అదనంగా 33 శాతం కార్డులు మహిళలకు కేటాయించాలనుకుంటున్నట్టు తెలిపారు. ఒకవేళ ఆ సంఖ్య మేరకు సంస్థల్లో మహిళలు లేకపోతే వాటిని ఖాళీగానే ఉంచాల్సి ఉంటుందన్నారు. జర్నలిస్టులకు జారీ చేసే హెల్త్ కార్డులు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ మోహన్‌కు సన్మానం



**కల్లూరు, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసునూరు బాలనాగేశ్వరావు, లక్ష్మి దంపతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా 13వార్డ్ లో పర్యటిస్తున్న కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ను సమస్యల పరిష్కారంలో ఎంతో కృషి చేస్తున్నందుకు అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. వార్డులో ఏ సమస్య అయినా సరే నా దృష్టి తీసుకురావాలి అని వారిని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, శీలం కృష్ణారెడ్డి, నాయకులు కూసునూరు లక్ష్మి, బాల నాగేశ్వరరావు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ షేక్ బాజీ, వేణుగోపాల స్వామి దేవాలయం కమిటీ సభ్యులు బొడ్డు పిచ్చయ్య, మజీద్ కమిటీ సభ్యులు ఎస్ కే ఖలీబ్, ఎస్.కె మైబూ, గుండ్ల రవీంద్ర, ఎస్.కె ముజిమ్, ఎం జమలయ్య, పోట్రూ రామారావు, అమ్మిక సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు జిల్లా,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత తో సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 17, ఇందిరమ్మ ఇండ్లు 03, పెన్షన్ 15, ఉద్యోగల కల్పన 02, ఇతర శాఖలకు సంబంధించినవి 12 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వాటిని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓ లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులందరూ ఉపయోగించుకోవాలి


- ములుగు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి.



**ములుగు జిల్లా,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సోమవారం ములుగు జిల్లా కేంద్రం లోని సంక్షేమ భవన్‌లో ఇ డి సి ర్యాంప్ అధ్వర్యం లో పీఎం విశ్వకర్మ పథకంపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్దార్థరెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దార్థ రెడ్డి గారు మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులు నిర్వహించే కార్మికుల సంక్షేమం మరియు ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా వడ్రంగులు, కంసాలులు, కుంచెవారు, దర్జీలు, నాయీలు, మట్టి పనివారు తదితర సంప్రదాయ వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఆధునిక పనిముట్లు మరియు ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా అందించబడుతుందని స్పష్టం చేశారు. అర్హులైన వృత్తిదారులకు ఈ పథకం ద్వారా తక్కువ వడ్డీతో రూ.1లక్ష వరకు రుణ సదుపాయం అందించడం జరుగుతుందని, శిక్షణ సమయంలో భృతి, ఉచిత టూల్‌కిట్ అందించబడుతుందని పేర్కొన్నారు. సంప్రదాయ వృత్తిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ వృత్తులను అభివృద్ధి చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అశోక్ గారు మరియు ఈడీసీ మేనేజర్ విక్రమ్,జూనియర్ అసిస్టెంట్ రామేందర్ తధితరులు పాల్గొన్నారు.

# సాగు నీరు సరఫరాపై పర్యవేక్షణ

- పిసిడబ్ల్యూ కథనానికి స్పందించిన అధికారులు
- ఎన్ఎస్పి డి ఈ వెంకటేశ్వరరావు



**కల్లూరు, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చివరి పంట పొలాల వరకు సాగునీరు అందించాలి అన్న కథనానికి ఎన్ఎస్పి అధికారులు స్పందించారు. పంటలు పొట్ట దశలో ఉన్నందున సుమారు సాగర కాలవ నుండి 800 క్యూసెక్కులు సాగు నీరు విడుదల చేయాలని రైతులు ప్రాధేయపడటంతో చేతికొచ్చిన పంట ఆగమైపోతుందని భయాందోళన చెందుతున్న రైతులకి అధికారులు ధైర్యాన్ని ఇచ్చారు. పంటలకు ఎటువంటి నష్టం కలగకుండా సాగు నీరు అందించేందుకు ప్రత్యేకమైన దృష్టి పెట్టి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు డి ఇ వెంకటేశ్వరావు తెలిపారు. పంటలకు సరిపడా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## ఐఐటి, నీట్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన
# సురభి కాన్వెంట్ విద్యార్థులు





**గంగాధర మార్చి 9(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలం మధుర నగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు 2025-26 సంవత్సరానికి గాను ఏకలవ్య సిరీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఐటి, నీట్ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి ప్రథమ బహుమతులు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం, దోమల్ గూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ స్థాపకుడు డా. జయప్రకాశ్ నారాయణ్ మరియు ఈ-గురుకులం ఫర్ ఐఏఎస్ స్థాపకుడు అకెల్లా రాఘవేంద్ర చేతుల మీదుగా విద్యార్థులు రాష్ట్రస్థాయి, తమ తరగతుల వారీగా ప్రథమ బహుమతులు, మెడల్స్ మరియు మెమొంటోలు అందుకున్నారు.ఈ సందర్భంగా సోమవారం సురభి కాన్వెంట్ హై స్కూల్ ఆవరణలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీరనర్సయ్య లు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థి పిల్లి ప్రణవి (8వ), తరగతుల వారీగా పోతన వేణి శివకుమార్ (6వ), మంచికట్ల స్నేహ (7వ), జంగపెల్లి యశ్వంత్ (9వ) బహుమతులను సాధించిన విద్యార్థులను అభినందించి వారికి మెమొంటోలు, మెడల్స్ అందజేశారు.ఐఐటి, నీట్ వంటి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కూడా ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించి వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

# ప్రపంచశాంతి కొరకు ప్రార్థించండీ: ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఏనోష్ కుమార్






**కల్లూరు, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రపంచంలో జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా క్రైస్తవ సమాజమంతా ప్రపంచ శాంతి నెలకొల్పబడాలని అందరూ ప్రార్థించాలని ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్ పిలుపు నిచ్చారు.కృపా సత్య సువార్త ప్రార్థన మందిరంలో ప్రేయర్ సెల్ సమావేశం ఆ సంఘ కాపరి పెరుమాళ్ళ దయాకర్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి రాయల తిమోతి అధ్యక్షతన జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఏనోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కొరకు, క్రైస్తవ సమాజ ఐక్యత కొరకు ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఏనోష్ కుమార్ మాట్లాడుతూ సంఘాలలో ఐక్యత, సమాజ క్షేమం కోసం, క్రైస్తవులు, క్రైస్తవేతరులు కోసం ప్రార్థనలు చేపట్టాలని కోరారు. ప్రతినెల మండలంలో జరుగుతున్న ప్రార్థన సమావేశాల ద్వారా ఒకరి కొరకు ఒకరు ప్రార్థన చేయడం వలన క్రైస్తవుల ఆత్మీయ జీవితం ఎంతో సంతృప్తి పొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాలను ఉద్దేశించి క్రీస్తు ప్రభువు బోధనలను వివరించారు. క్రీస్తు ప్రభువు బోధనలను అనుసరిస్తూ మన జీవితాలు ముందు కొనసాగాలని, ఆయన కనపరచిన ప్రేమ, కరుణ, దయ, సమాధానం, సమాజానికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు తేళ్లూరి సంజీవరావు, రాయల తిమోతి, గౌడిపేరు జీవన్ కుమార్, సుందర్ రాజు, ఆదూరి రాజశేఖర్, జీవి దాసన్న, వేము ప్రభాకర్, బాల సుందరం, ఖమ్మంపాటి యోసేపు, థామస్, పలువురు దైవ సేవకులు పాల్గొన్నారు.

# మూడోసారి ప్రపంచ కిరీటాన్ని అందుకున్న భారత్

● పాఠశాలలో విద్యార్థుల సంబరాలు




**ఖమ్మం ప్రతినిధి మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత క్రికెట్ జట్టు మరోసారి చరిత్ర సృష్టించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచ కప్ తుదిపోరులో న్యూజిలాండ్ నేషనల్ క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ జట్టు ఘన విజయం సాధించి,ప్రపంచ కిరీటాన్ని మూడోసారి సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా క్రీడాభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇంతకు ముందు భారత్ 2007 సంవత్సరంలో ఎంఎస్. ధోని నాయకత్వంలో తొలిసారి, 2024 సంవత్సరంలో రోహిత్ శర్మ సారథ్యంలో రెండోసారి ఈ ఘనత సాధించింది. తాజాగా 2026లో నా సూర్య కుమార్ నాయకత్వంలో మరోసారి ప్రపంచ కిరీటాన్ని అందుకుని భారత జట్టు తన ప్రతిభను చాటుకుంది.ఈ విజయాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని 59 వ డివిజన్ స్థానిక సేక్రెడ్ హార్ట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. భారత జెండాలు ఊపుతూ నినాదాలు చేస్తూ విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచుకుని జట్టు విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చంద్రకళ, సుజాత, శ్రీను, నరసింహరావు (వ్యాయామ ఉపాధ్యాయులు) మరియు ఇతర సిబ్బంది పాల్గొని భారత జట్టుకు అభినందనలు తెలిపారు. భారత్ మూడోసారి ప్రపంచ కిరీటాన్ని గెలుచుకోవడం దేశానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు

## రెడ్డి కార్పొరేషన్ కు వెంటనే నిధులు కేటాయించాలి:
# ఏప్రిల్‌లో కరీంనగర్ రెడ్డి బహిరంగ సభ...

● రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి




**కరీంనగర్,మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** పేద రెడ్డి యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి రెడ్డి మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. నెల రోజులలో కార్పొరేషన్ ఏర్పాటు చేయక పోతే ఎప్రిల్ నెల చివరి వారంలో కరీంనగర్ లో రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్ని రెడ్డి సంఘాలను కలుపుకొని రెడ్ల రణ భేరి పేర బహిరంగ సభ నిర్వహిస్తామని, ప్రభుత్వానికి తమ శక్తి చాటి చెప్తామన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారం లోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం జరిగింది. కానీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదని, వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రూ.2000 కోట్లతో ప్రత్యేక నిధిని కేటాయించాలని ఆయన కోరారు. కార్పొరేషన్ పై ప్రభుత్వం స్పందించకపోతే కార్పొరేషన్ నిధుల సాధన లక్ష్యంగా ఏప్రిల్ మాసంలో భారీ బహిరంగ సభకు సన్నద్ధం మవుతున్నట్లు తెలిపారు.

# మైనారిటీ ఎంప్లాయిస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**సిరిసిల్ల,మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ సిరిసిల్ల జిల్లా క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మైనారిటీ ఉద్యోగులు తమ ఉద్యోగ సంబంధిత సమస్యలను ముఖ్యంగా జిల్లా కార్యాలయాలలో ముస్లిం ఉద్యోగులు తమ నమాజ్ ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రత్యేక గది స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ షేక్ నిజార్ అహ్మద్ హాజరై మైనారిటీ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ ఐక్యతపై ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. మైనారిటీ ఉద్యోగుల ఐక్యతను, వారి హక్కుల సాధనకు సంఘం చేస్తున్న కృషిని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు అహ్మద్ అబ్దుల్ రసూల్,జిల్లా ప్రధాన కార్యదర్శిమొహమ్మద్ షఫియుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ కరీం సాహెబు, కోశాధికారిమిర్జా సమీ ఉల్లా బేగ్, ఉపాధ్యక్షులు షరీఫ్ మొహియుద్దీన్, నజీర్ అహ్మద్, అయూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శి మొహమ్మద్ ఆజం, మిర్జా ఫసాహత్ అలీ బేగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాలి మహమ్మద్, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆయేషా తలత్, ప్రెస్ పబ్లిసిటీ సెక్రటరీ,అహ్మద్ పాషా, ఐటి సెక్రటరీ మొహమ్మద్ జకీర్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ,సయ్యద్ సర్వర్, ఈసీ సభ్యులు మైనారిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్యానర్ల రగడ.. మునిసిపల్ కమిషనర్‌ను నిలదీసిన తెలుగు తమ్ముళ్లు




**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణంలో శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ పట్టణంలో రాజకీయ నాయకులు, యువత, పలువురు ప్రముఖులు పలు ప్రాంతాలలో శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి వర్గీయులు ఏర్పాటుచేసిన బ్యానర్లను మునిసిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించి తొలగించారని తెలుగు తమ్ముళ్లు మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి వర్గీయులు మున్సిపల్ కమిషనర్ ను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ పీఎం మోడీ, సీఎం చంద్రబాబు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. మరియు మంత్రులు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిల ఫోటోలు ఉన్న బ్యానర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓవర్గంపై మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని వారు వాపోయారు. మున్సిపల్ కమిషనర్ తన సొంత నిధులతో బ్యానర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.



# హై రిస్క్ గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు



**బొమ్మనహల్ మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో బొమ్మణహల్,కురువల్లి,నేమకల్ గ్రామాలలో ఉన్న హై రిస్క్ గర్భిణీలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ గర్భిణీలు రెగ్యులర్‌గా తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అదే విదంగా సమయానికి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మరియు నేడు (10-03-2026) బందూరు,ఉంతకల్లు,ఉద్దేహల్ గ్రామాల హై రిస్క్ గర్భిణీలకు కూడా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.ఈ అవకాశాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ సూపర్వైజర్ జె.రుక్మిణి, ఏఎన్ఎంలు,ఎంఎల్‌హెచ్పీలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయచోటి నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన పి.రమణారెడ్డి



**రాయచోటి మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** రాయచోటి పురపాలక సంఘం,నూతన కమిషనర్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ జి రవి బదిలీపై విజయవాడ సెక్రటేరియట్ బదిలీపై వెళ్లారు. విజయవాడ సెక్రటేరియట్ లో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.రమణ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో వార్డు వీధుల్లో మురికి కాలువలు చెత్తాచెదారం పై ప్రత్యేక దృష్టిసారిస్తామని రాయచోటి నూతన కమిషనర్ పి రమణారెడ్డి తెలియజేశారు

# ఇరవై వసంతాల వర్సిటీ పండుగలో విద్యార్థుల సందడి





**కడప మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** విశ్వవిద్యాలయం ఆవిర్భావానికి ఇరవై సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన వర్సిటీ పండుగలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. దేశభక్తి గీతాలతో ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, జానపద బాణీలో సాగిన పాటలకు విద్యార్థులు అందంగా అడుగులు కలిపి అందరినీ అలరించారు.అలాగే సినిమా పాటలకు చేసిన నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థుల ఉత్సాహానికి ఆడియన్స్ కూడా స్పందించి స్టేజిపై ఉన్న వారికి జతగా స్టెప్పులు వేస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. దీంతో వర్సిటీ పండుగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సాగింది.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకై హెచ్‌పీవీ వ్యాక్సిన్

**టీకా తీసుకుందాం గర్భాశయ క్యాన్సర్‌ను తరిమికొడదాం**

**బిడ్డ భవిష్యత్తుకు హెచ్‌పివి టీకా రక్షణ కవచం**

**మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**




**కల్లూరు, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు కిషోర బాలికలు తప్పకుండా హెచ్ పి వి వ్యాక్సిన్ ను వేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ తల్లిదండ్రులను కోరారు.సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినస్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కిషోర బాలికలకు గర్భాశయ క్యాన్సర్ ను నివారించే హెచ్ పి వి వ్యాక్సిన్ ను కల్లూరు పురపాలక చైర్మన్ దారావత్ మోహన్ వైద్య బృందంతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ 14 సంవత్సరాల వయస్సు గల బాలికల అందరికీ తల్లిదండ్రులు అందరూ విధిగా ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పి వి టీకాను వేయించాలని కోరారు. బిడ్డ భవిష్యత్తు కోసం హెచ్ పి వి టీకా రక్షణ కవచం లాంటిదని అన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ బారి నుండి కాపాడబడతామని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం కిషోర్ బాలికల ఆరోగ్య సంక్షేమం కోసం ఇచ్చే ప్రతి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా నాయకులు కొర్లగూడెం మాజీ సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, పురపాలిక వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ నవ్య కాంత్, తాసిల్దార్ పులి సాంబశివుడు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సిడిపిఓ నిర్మల జ్యోతి, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు ఆళ్లకుంట నర సింహారావు, లక్ష్మీపురం సర్పంచ్ రవీంద్రనాయక్, శీల ంకృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 54 డివిజన్‌లో రుద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు




**హనుమకొండ ప్రతినిధి,మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ 54 డివిజన్ పెగడపల్లి డబ్బాల వద్ద రుద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రుద్ర ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ గోపికృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాదులోని శంకర హాస్పిటల్ వారి సౌజన్యంతో పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు కంటి పరీక్షలతో పాటు బిపి,షుగర్ పరీక్షలు కూడా నిర్వహించామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని ఇప్పటివరకు 300 మంది ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించుకొని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.వయసు పైబడిన వారికి కంటి ఆపరేషన్లు హైదరాబాదులో ఉచితంగా నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సతీష్, రాము, రాజకుమార్, రాజు, క్రాంతి క్రాంతి, వెంకన్న, వైద్యులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ శక్తికి ప్రతిరూపమే: ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్

**మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి: బండి పద్మ**

**సృష్టికి మూలం మహిళ, మహిళ లేనిదే మనవడ లేదు**




**ఉప్పల్ మార్చి09 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బిజెపి పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బండి పద్మ ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, బిజెపి పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ అమ్మగా, భార్యగా, కూతురుగా, అన్ని పాత్రలకు సరైన న్యాయం చేసే స్త్రీ ఈ భూమితో సమానమైన సహనశీలి అందుకే ఆమెను మనం గౌరవిద్దాం ఆదరిద్దామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాజకీయంగా ఆర్థికంగా మహిళలు బలోపేతం చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సృష్టికి మూలం మహిళ మహిళలేనిది మనుబడలేదని ప్రతి మహిళా శక్తి కి ప్రతిరూపమని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ సందర్భంగా బండి పద్మ మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ఆర్థికంగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతామని రాజకీయాల్లో మహిళలకు సమానమైన వాటా కల్పించాలని, మహిళలను కించపరిచే వారిపట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై క్రైమ్ రేటు పెరిగిందని, ఆడవాళ్ళ భద్రత ప్రభుత్వ బాధ్యత అది మీరు వేసే భిక్ష కాదని గుర్తు పెట్టుకోవాలని, ఇల్లు స్కూల్ హాస్పిటల్ ఏది నడవాలన్నా మహిళలు ఉండాల్సిందేనని, వంటింటికి మహారాణి అంటారు కానీ వంటింటి పాత్రలపై పురుషుల పేర్లే ఉంటున్నాయని ఈ సందర్భంగా అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు చింతకింది ప్రవీణ్, కనావత్ రాజు, పుల్లూరు భాస్కర్,కొండేరు స్రవంతి మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఒక్క ఓటుతో ఓటమి... కానీ ప్రజాసేవలో ముందున్న రజినీ నవీన్



**పరకాల మార్చి 9 (పిసీడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్ ప్రజాసేవ పట్ల చూపుతున్న అంకితభావం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పరకాల 17వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రజినీ నవీన్ కేవలం ఒకే ఒక బ్యాలెట్ ఓటు తేడాతో ఓడిపోయినప్పటికీ నిరుత్సాహానికి లోనుకాకుండా ప్రజల మధ్యనే ఉండి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గెలుపు–ఓటములు రాజకీయాల్లో సహజమేనని, అయితే ప్రజల కోసం పనిచేయడం తన అసలు లక్ష్యమని రజినీ నవీన్ స్పష్టం చేస్తున్నారు. గతంలో 13వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన సమయంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి, రిజర్వేషన్ కారణంగా పార్టీ ఆదేశాల మేరకు 17వ వార్డు నుంచి పోటీ చేశానని తెలిపారు. కేవలం ఒక ఓటు తేడాతో ఓడిపోయినా, ప్రజల విశ్వాసం తనకు ఎంతో పెద్ద బలం అని పేర్కొన్నారు."ప్రజలే నాకు దైవం. ఓటు వేసినవారైనా, వేయనివారైనా అందరూ నా వారే. వార్డులో ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాను" అని రజినీ నవీన్ అంటున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఆయన ప్రజలతో నిరంతరం మమేకమై, వార్డు సమస్యలపై స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు.ఇటీవల వార్డులో మరణించిన కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన చోట సహాయం అందించడం ద్వారా ఆయన ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు. అలాగే వార్డులో తలెత్తుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం కోసం కృషి చేయడం కొనసాగిస్తున్నారు. రాజకీయాల్లో పదవి లేకపోయినా ప్రజలతో అనుబంధం కోల్పోకుండా సేవా దృక్పథంతో పనిచేయడం పరకాల పట్టణంలో ప్రత్యేక చర్చకు దారితీసింది. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే ఆయన తీరు స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది."ఒక్క ఓటు తేడాతో ఓడిపోయినా ప్రజల మధ్యే ఉండి సేవ చేయడం నిజమైన నాయకత్వం" అని వార్డు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా రజినీ నవీన్ ఇలాగే ప్రజల కోసం పనిచేస్తూ ముందుకు సాగాలని ఆశిస్తున్నారు.రాజకీయాల్లో గెలుపు–ఓటముల కంటే ప్రజల నమ్మకం గొప్పదని నిరూపిస్తూ రజినీ నవీన్ ప్రజాసేవను తన ధ్యేయంగా తీసుకుని ముందుకు సాగడం పరకాలలో ఆదర్శంగా నిలుస్తోంది.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఆడబిడ్డ పెళ్లికి భరోసా కల్యాణ లక్ష్మి.**

**పేద మధ్యతరగతి ప్రజలకు వరం**

**సిఎంఆర్ఎఫ్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**





**గంగాధర మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి క్రింద రూ. 90,10,440 ఆర్థిక సాయం మంజూరు అయింది. అలాగే 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద రూ:10,86,000 ఆర్థిక సహాయం మంజూరు అయింది. సోమవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ఆడబిడ్డల పెళ్ళికి కళ్యాణ లక్ష్మి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అలాగే అనారోగ్యంతో, ప్రమాదాల్లో గాయపడి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తుంది అన్నారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకొని అండగా ఉంటామని పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత ఎండిఓ దామ్ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు,రామిడి రాజిరెడ్డి,గును కొండ బాబు, బారాజు ప్రభాకర్ రెడ్డి,పడాల భాగ్యలక్ష్మి రాజన్న, వేముల భాస్కర్,కడారి హారిక కనకయ్య,రాచమల్ల రవి,బాబ లక్ష్మి మధు,చిందం ఆంజనేయులు,బిర్ల ఆనందం,రెండ్ల శ్రీనివాస్,బాసవేణి శ్రీనివాస్,అరె తెజ శ్రీ రాజశేఖర్, సాగి అజయ్ రావు, కర్ర విద్యా సాగర్ రెడ్డి,మంత్రి మహేందర్, గంగాధర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆర్థిక భరోసా: 11న సాయం పంపిణీ...

**- ముఖ్య అతిథిగా హాజరుకానున్న జిల్లా అదనపు కలెక్టర్ & డీఈఓ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**హుజురాబాద్,మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలిచేందుకు హుజురాబాద్ మండలం సింగాపూర్‌కు చెందిన జయన్న ఫౌండేషన్ మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 11వ తేదీన హుజురాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వేదికగా ఈ సహాయ పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుంది.ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు జిల్లా ఇన్‌ఛార్జ్ విద్యాశాఖాధికారి (ఇజూూ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ అశ్విని తానాజీ వాకడే గారు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జయన్న ఫౌండేషన్ చేపట్టిన ఈ ఉదాత్తమైన కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఆమె స్వయంగా విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని పంపిణీ చేయనున్నారు. **300 మంది విద్యార్థులకు అండగా.** హుజురాబాద్ మండలంలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు 300 మంది నిరుపేద విద్యార్థులను గుర్తించి, వారికి పరీక్షల సమయంలో రవాణా, అల్పాహారం మరియు ఇతర ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 700/- చొప్పున నగదును ఫౌండేషన్ అందజేయనుంది. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు నిపుణులైన కౌన్సెలర్ల ద్వారా విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ కూడా ఇప్పించనున్నారు. **కొనసాగుతున్న సేవా యజ్ఞం.** గత రెండేళ్లుగా విద్య మరియు వైద్య రంగాల్లో జయన్న ఫౌండేషన్ నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. గతంలో 4000 మందికి ఎగ్జామ్ కిట్ల పంపిణీ, 5000 మందికి కంటి పరీక్షలు, మరియు 1289 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి తన మానవత్వాన్ని చాటుకుంది. అలాగే 24 గంటల ఉచిత అంబులెన్స్ సేవలను కూడా గ్రామాల్లో అందుబాటులో ఉంచింది.విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ గొప్ప కార్యక్రమాన్ని విద్యావేత్తలు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.



# క్రాంతి నగర్ కాలనీలో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్డు పనులు

**• శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని,మేయర్ గుండు సుధారాణి**




**హన్మకొండ మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్ క్రాంతి నగర్ కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే,కాలనీలో రహదారి సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు వరుసగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీవాసులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్ గౌడ్,సీనియర్ నాయకులు సుగుణాకర్ రెడ్డి,అశ్వన్,బాలు నాయక్,దేవేందర్ రెడ్డి,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను తప్పుదారి పట్టిస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న గార్ల తహసిల్దార్ ఆర్ శారద, ఎంపిడిఓ మంగమ్మలను సస్పెండ్ చేయాలి




**గార్ల,మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** మున్నేరు పాలేరు లింకు కెనాల్ విషయంలో గార్ల మండలంలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన విధివిధానాలను పాటించకుండా పేషా గ్రామ సభలంటూ వివిధ గ్రామాలలో పోలీసుల నిర్బంధం – పహారాలో సభలు నిర్వహిస్తూ ప్రజాస్వామ్యానికి , రాజ్యాంగానికి, పీసా చట్టానికివిరుద్ధంగా ప్రజలను, రైతులను, రాజకీయపక్షాలను తప్పుదారి పట్టిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న గార్ల మండల తహసిల్దార్ ఆర్. శారద, ఎండిఓ మంగమ్మ లను సస్పెండ్ చేయాలని మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, కన్వీనర్లు జడ సత్యనారాయణ, కందునూరు శ్రీనివాస్, విశ్వ జంపాల, గుగులోత్ సక్రు, కత్తి సత్యం, జంపాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం గార్ల మండల కేంద్రంలోని మున్నేరు జలసాధన కమిటీ కార్యాలయంలో నిర్వహించిన మున్నేరు జలసాధన కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ గార్ల మండలంలో పీసా చట్టం 1996 ప్రకారం పీసా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయకుండా పీసా గ్రామ సభలను నిర్వహిస్తు, ప్రజలకు ముందస్తు సమాచారం (పత్రికా ప్రకటన) లేకుండా, సభలు నిర్వహణ సమాచారం బహిరంగంగా వెల్లడించకుండా, నిర్ణీత సమయంలో సంబంధిత ఓటర్లకు మున్నేరు పాలేరు లింకు కెనాల్ బాధిత రైతాంగానికి తెలియపరచకుండా సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పీసా గ్రామ కమిటీల విధివిధానాలు పాటించకుండా, మరోపక్క స్థానిక రైతాంగాన్నీ సభలకు హాజరు కాకుండా పోలీస్ వారితో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మున్నేరు పాలేరు లింక్ కెనాల్, పెస గ్రామ కమిటీల అవగాహన సభలని ప్రచారం చేస్తూ రహస్యంగా మున్నేరు పాలేరు లింకు కెనాల్ నిర్మాణానికి అనుకూలంగా పీసా గ్రామ కమిటీ తీర్మానాలు చేస్తున్నారని వారు అన్నారు. గార్ల మండల అధికారుల అనాలోచిత అధికార నిర్వాహకం వల్ల భవిష్యత్తులో గార్ల మండల ప్రజలు తాగునీరు సాగునీరు విషయంలో తీవ్ర అన్యాయానికి గురి అవుతారని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా గార్ల మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కందునూర్ ఈశ్వర్ లింగం, తోట కొండల్ రావు, శివాజీ, చంటి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కడపలో వైకాపాకు భారీ షాక్..!

- టీడీపీలో చేరిన 300 కుటుంబాలు



**కడప మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కడప నగరంలో వైకాపాకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మాజీ కార్పొరేటర్ ఓర్సు బాలకొండయ్య ఆధ్వర్యంలో సుమారు 300 కుటుంబాలు వైకాపాను వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. కడప నగరంలోని 2వ డివిజన్ చలామారెడ్డిపల్లికి చెందిన వైసీపీ మాజీ కార్పొరేటర్ ఓర్సు బాలకొండయ్య మరియు వారి అనుచరులు టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, అదే నమ్మకంతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. కడప నగర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తూ నగర అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆక్రమిత ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం







**- హెల్త్ సెంటర్, వీవో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి భూమిపూజ.**

**తిమ్మాపూర్,మార్చి9(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం తిమ్మాపూర్ లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం,మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు తిమ్మాపూర్ లో పలు చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్టుగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే చూస్తూ ఉర్కోబోమని ఆయన స్పష్టం చేశారు. తిమ్మాపూర్ లో సర్వేలు జరిపించి ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు ఆ స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. నిర్మాణం పనులు చేపట్టనున్న ఆరోగ్య ఉప కేంద్రం స్థలం వద్ద నీరు నిలవకుండా కాలువ ద్వారా మళ్లించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. వీవో భవన నిర్మాణాన్ని మే మాసాంతానికల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా నీటి సౌకర్యం కోసం వీవో భవనం వద్ద బోరు వెల్ వేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల ఇప్పటికే ఎంతో మంది మహిళలు పారిశ్రామివేత్తలుగా ఎదిగారని ఆయన చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని డాక్టర్ కవ్వంపల్లి విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, ఇప్పటి వరకు తిమ్మాపూర్ గ్రామానికి 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మలి,తుది విడుతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.ఈ కార్యక్రమాల్లో తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి మల్హోత్ర, ఎంపీవో ప్రదీప్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ పైడిపల్లి అంజిబాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసిల్లా, డాక్టర్ పుల్లారావు, పశువైద్యాధికారి డాక్టర్ టి.మౌనిక, పంచాయతీరాజ్ ఏఈ స్నేహజ్యోతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు పోలు రాము,రమేశ్, చింతిరెడ్డి లక్ష్మారెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, నగునూరి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి చింతకింది చంద్రశేఖర్, వార్డు సభ్యులు చిలుకూరి రాజు, నగునూరి రజిత, బొర్ర వంశీ, పోతరాజుల స్వప్న, దేవేందర్, తమ్మనవేణి నర్సయ్య, మాతంగి అంజయ్య,జక్కని నవ్య,సతీష్.మల్లమ్మ,వీవోఏలు నగునూరి మంజుల, ఓరుగంటి శారదరెడ్డి, ఎండీ బిస్మిల్లా పాల్గొన్నారు.

## ఆర్డీటీపై ఆంక్షలు దుర్మార్గం: డిసిసి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఫైర్



**ఉరవకొండ మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అనంతపురం జిల్లాలో దశాబ్దాలుగా పేదలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ ఆర్డీటీ' ధర్నాలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్డీటీపై వచ్చిన తప్పుడు ఆరోపణలను సాకుగా చూపుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఆర్డీటీ కోసం ప్రజలు, రాజకీయ పార్టీలు ఉద్యమిస్తుండగా, లోకేష్ ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిశామని త్వరలో శుభవార్త వస్తుందని చెబుతున్నారని విమర్శించారు.ఇది ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం పన్నుతున్న కుట్ర అని ఆరోపించారు.ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ సంస్థ గత 56 సంవత్సరాలుగా జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు.ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆర్డీటీ సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఇన్చార్జ్ వై. విశ్వేశ్వర్ రెడ్డి, యువనేత వై. ప్రణయ్ రెడ్డి, గడేకల్ కరణం భీమరెడ్డి, హావలిగి భరత్ రెడ్డి, ఏసీ ఎర్రిస్వామి, జడ్పిటిసిలు, ఎంపీపీలు, అలాగే కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నేతలు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**- ఖమ్మం డివిజన్ సహాయ సంక్షేమ అధికారి అబ్దుల్ రవూఫ్**

**- పై చదువులకై ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**





**ఖమ్మం ప్రతినిధి, మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుంటూ క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఖమ్మం డివిజన్ సహాయ సంక్షేమ అధికారి ఎం.డి అబ్దుల్ రవూఫ్ పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పై చదువుల సంక్షేమ పథకాలు, వసతి గృహాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఖమ్మం నగరంలోని షెడ్యూల్డ్ కులముల బాలుర వసతిగృహం (ఏ)లో ఆదివారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ కార్యక్రమం వసతిగృహ సంక్షేమ అధికారి ఎడ్ల మల్లారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం డివిజన్ ఎ.ఎస్.సి.డి.ఓ మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ వసతి గృహాలను కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు ఉత్తమ వసతులు, నాణ్యమైన భోజనం, విద్యా వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన విద్యార్థుల విజయానికి కీలకమని అన్నారు. చదువుతో పాటు మంచి నడవడి, విలువలు అలవరుచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు హితవు పలికారు.సాంఘీక సంక్షేమశాఖ అధికారులు విద్యార్థుల సంక్షేమం, వారి విద్య అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతాధికారులు, వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదిగి వసతి గృహాలతో పాటు తమ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమం సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక డ్యాన్స్ లు, డిజే పాటలతో విద్యార్థుల కేరింతలు ఎంతో అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మెట్టు వీరయ్య, ఇందిరానగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్నేహలత, నేలకొండపల్లి కాలేజీ బాలుర హాస్టల్ హెచ్.డబ్ల్యూ.ఓ నరేందర్ రెడ్డి, తిరుమలాయపాలెం హెచ్.డబ్ల్యూ.ఓ నరేష్, ఖమ్మం ఆనందనిలయం బాలుర వసతిగృహ హెచ్.డబ్ల్యూ.ఓ నెల్లూరి రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోమలరాజు రాజశేఖర్ రాజు విందులో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు

**సుండుపల్లి మార్చి 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టి.సుండుపల్లి మండలం పొలిమేరపల్లె గ్రామం గుంతరాచల్లెలో సోమలరాజు రాజశేఖర్ రాజు సోమవారం ఆత్మీయ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజశేఖర్ రాజు ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన సుగవాసి ప్రసాద్ బాబుకు గ్రామ పెద్దలు,అభిమానులు ఘన స్వాగతం పలికారు.గ్రామ ప్రజలతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరువాత ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సుండుపల్లి మండల టిడిపి అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు, యూనియన్ బాషా, మన్నేరు రామాంజనేయులు, మిక్కిలినేని వెంకటరమణ నాయుడు, బిల్లు నాయక్, రెడ్డి నాయక్, హరిప్రసాద్ రాజు, బడిశెట్టి రవి, ప్రవీణ్ రాజు, మనోహర్, వాసు, విశ్వనాథ్, వెంకటరమణ, రాహుల్, రెడ్డి తదితర స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు,పాల్గొన్నారు.

# తిలక్ వర్మకు తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్!



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో సరికొత్త చరిత్రను లిఖించింది. డిఫెండ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టుగా చరిత్రకెక్కింది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో బ్యాట్‌తో పరుగుల వరద పారించి, బంతితో అలవోకగా న్యూజిలాండ్‌ను పడగొట్టేసిన సూర్యకుమార్ బృందం విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయం నేపథ్యంలో భారత ఆటగాళ్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కూడా మరికాసేపట్లో భారీ నజరానాను ప్రకటించనుంది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, క్రికెట్ అసోసియేషన్స్ కూడా తమ ఆటగాళ్లపై కనకవర్షం కురిపించనున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణకు చెందిన స్టార్ బ్యాటర్ తిలక్ వర్మకు కూడా కాంగ్రెస్ సర్కార్ నుంచి భారీ బహుమతి లభించనున్నట్లు క్రీడా వర్గాల్లో వార్తలు షికారు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి టీ20 ప్రపంచకప్ విజయంలో భాగమైన తిలక్ వర్మ, సిరాజ్‌లను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించనున్నట్లు తెలుస్తోంది. సిరాజ్‌కు గతంలోనే భారీ రివార్డ్ ప్రకటించిన నేపథ్యంలో తిలక్ వర్మకు ఈ సారి భారీ నజరానాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఈ విషయాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచకప్ గెలిచిన తిలక్ వర్మ, సిరాజ్ ప్రస్తుతం జట్టుతో అహ్మదాబాద్‌లోనే ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని భారత జట్టు కలిసే అవకాశం ఉంది. ఆ తర్వాత బీసీసీఐ నిర్వహించే విజయోత్సవ వేడుకల్లో జట్టు పాల్గొననుంది. బుధవారం లేదా గురువారం తిలక్ వర్మ, సిరాజ్ హైదరాబాద్ చేరుకునే అవకాశం ఉంది. ఈ ఇద్దరి ఛాంపియన్స్‌ను ఘనంగా స్వాగతం పలికేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, తెలంగాణ సర్కార్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించేందుకు హెచ్‌సీఏ సిద్ధమైంది. అసాధారణ ప్రదర్శనతో తెలంగాణ గర్వపడేలా చేసిన తిలక్ వర్మ, మహమ్మద్ సిరాజ్‌లను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సన్మానించే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే తిలక్‌కు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు క్యాష్ ప్రైజ్, ఇంటి స్థలంను బహుమతిగా అందజేయనున్నారని టాక్ వినిపిస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో భాగంగా ఉన్న సిరాజ్‌కు తెలంగాణ సర్కార్ డీఎస్పీ ఉద్యోగంతో పాటు జూబ్లీహిల్స్‌లో 600 గజాల నివాస స్థలాన్ని బహుమతిగా అందజేసింది. తిలక్ వర్మకు కూడా గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం బహుమతిగా అందజేయవచ్చని స్పోర్ట్స్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. భారత విజయాన్ని కొనియాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# గంభీర్ అన్‌స్టాపబుల్..



భారత క్రికెట్‌లో గౌతమ్ గంభీర్ పేరు మరోసారి మార్మోగిపోతోంది. టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే అతను అద్భుతాలు సృష్టిస్తున్నాడు. అయితే మధ్యమధ్యలో తనపై అనేక విమర్శలు వచ్చినా అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగాడు. తాజాగా అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ ఘనవిజయం సాధించడంతో గంభీర్ ఖాతాలో ఒక అరుదైన ప్రపంచ రికార్డు చేరింది. రెండు విధాలుగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి క్రికెటర్‌గా అతడు అరుదైన ఘనత సాధించాడు. గౌతమ్ గంభీర్ ప్రయాణం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ నెగ్గిన భారత జట్టులో అతడు సభ్యుడు. ఆ టోర్నీలో ప్లేయర్‌గా అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. సరిగ్గా 19 ఏళ్ల తర్వాత, 2026లో అదే టోర్నీలో మళ్లీ టీ20 వరల్డ్‌కప్‌ను అందుకున్నాడు. అయితే ఈసారి కోచ్‌గా ఆ ఘనత సాధించాడు. జట్టుకు కోచ్‌గా ఉంటు తన వ్యూహాలతో టీమ్‌ఇండియాను విజేత నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇలా రెండు విభిన్న పాత్రల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం క్రికెట్‌లో ఇదే తొలిసారి. దీనికి తోడు 2011 వన్డే వరల్డ్ కప్ విజేత జట్టులో కూడా గంభీర్ సభ్యుడిగా కీలకపాత్ర పోషించాడు. భారత సీనియర్ పురుషుల జట్టు కోచ్‌లలో ఇంతవరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డును గంభీర్ అందుకున్నాడు. కేవలం రెండేళ్లలోపే రెండు ఐసీసీ ట్రోఫీలు (2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్) గెలిపించిన ఏకైక కోచ్‌గా నిలిచాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో కివీస్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించిన భారత్, ఇప్పుడు అహ్మదాబాద్‌లో అదే కివీస్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి వరుస విజయాలను అందుకుంది. ఈ రెండు భారీ విజయాల వెనుక గంభీర్ మాస్టర్ మైండ్ ఉందనడంలో సందేహం లేదు. గౌతమ్ గంభీర్ తన దూకుడు స్వభావంతో జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. సీనియర్లు, జూనియర్ల మధ్య సమన్వయం కుదురుస్తూ తీసుకున్న నిర్ణయాలు నేడు భారత్‌కు మరో కప్పు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా సంజు శాంసన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లపై ఉంచిన నమ్మకం ఫైనల్ మ్యాచ్‌లో సరైన ఫలితాన్ని ఇచ్చింది. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన గంభీర్, భవిష్యత్తులో మరిన్ని విజయాలను టీమ్‌ఇండియాకు అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. కోచ్‌గా గంభీర్ ప్రయాణం అంత సాఫీగా ఏమీ సాగలేదు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా వరుసగా ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాలు విమర్శల వర్షం కురిపించాయి. సంప్రదాయ క్రికెట్‌లో కూడా అగ్రెసివ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని గంభీర్ చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో, కోచింగ్ శైలిపై నెగిటివ్ కామెంట్స్ గట్టిగానే వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లను పక్కన పెట్టి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, అది జట్టు బలాన్ని దెబ్బతీస్తోందనే వాదనలు కూడా గట్టిగా వినిపించాయి.

# విషాదాన్ని అధిగమించి.. ఇషాన్ కిషన్ కీలక ఇన్నింగ్స్

ఒకానొక సమయంలో ఇండియా నేషనల్ టీంకు దూరమైన ఇషాన్ కిషన్, తన కష్టంతో తలరాతను మార్చుకున్నాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత అతనికి జాతీయ జట్టులో చోటు దక్కింది. ఇప్పుడు అతను పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టులో సభ్యుడు. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇషాన్ 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో హాఫ్ సెంచరీ (54 పరుగుల) ఇన్నింగ్స్ ఆడాడు. ఫైనల్ మ్యాచ్‌కు కేవలం ర2 రోజుల ముందే ఇషాన్ కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. మీడియా నివేదికల ప్రకారం, ఫైనల్‌కు రెండు రోజుల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇషాన్ కిషన్ సోదరి (కజిన్), బావ మతిచెందారు. కుటుంబంలో ఇంతటి భారీ విషాదం నెలకొన్నప్పటికీ, ఇషాన్ కిషన్ దేశానికే ప్రియారిటీ ఇస్తూ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తాను ఇంతటి బాధలో ఉన్నాననే విషయాన్ని అస్సలు తెలియనివ్వలేదు. ఇటీవల రింకూ సింగ్ తండ్రి కన్నుమూశారు. అక్కడ కార్యక్రమం నిర్వహించిన వెంటనే రింకూ వెంటనే జాతీయ జట్టు కోసం తిరిగి వచ్చి దేశానికి తొలి ప్రాధాన్యం ఇచ్చాడు. ఇషాన్ కిషన్ తండ్రి ప్రణవ్ పాండే మాట్లాడుతూ.. “మేం చాలా కష్టంలో ఉన్నాం. ఇషాన్‌కు కూడా ఇంటివి రావాలి అనిపించింది. కానీ ప్రపంచ కప్‌లో జాతీయ జట్టుకు ఆడాల్సి ఉన్న కారణంగా రాలేకపోయాడు. అతను తన బాధను దిగమింగుతూ జట్టు కోసం మంచి ఇన్నింగ్స్ ఆడాడు’ అని తెలిపారు. ఈ విషాదం కారణంగానే ఇషాన్ కిషన్ తండ్రి ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు అహ్మదాబాద్ రాలేదు. టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ బ్యాట్ ఝుళిపించి సత్తా చాటాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అతను 4వ స్థానంలో నిలిచాడు. ఇషాన్ 9 మ్యాచ్‌ల్లోని 9 ఇన్నింగ్స్‌ల్లో 35.22 సగటుతో, 193.29 మెరుపు స్ట్రైక్ రేట్‌తో 317 పరుగులు సాధించాడు. టోర్నీలో ఇషాన్ కిషన్ 3 అర్ధ శతకాలు చేశాడు. షాన్ ఇప్పటివరకు తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో 45 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌ల్లోని 45 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేస్తూ 1328 పరుగులు చేశాడు. అతడు ఒక్క సెంచరీ, 10 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్లు సంజూ శాంసన్ (89), అభిషేక్ శర్మ (52) తో పాటు వన్డ డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీలతో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.





# టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా విజేగా నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ 159 పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచిన టీమ్‌గా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీమిండియాకు ఇది మూడో టీ20 ప్రపంచకప్ కావడం విశేషం. విశ్వవిజేతగా నిలిచిన టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్ అందజేయనుంది. ఈ టోర్నీ కోసం ఐసీసీ మొత్తం 13.5 మిలియన్ డాలర్ల(రూ.120 కోట్ల) ప్రైజ్‌మనీ ప్రకటించింది. ఈ ప్రైజ్‌మనీని టోర్నీలో పాల్గొన్న జట్ల స్థానాల ఆధారంగా పంపిణీ చేయనున్నారు. ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు ప్రైజ్‌మనీగా 3 మిలియన్ డాలర్లు(రూ.27.48 కోట్లు) దక్కనుంది. ఫైనల్లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు 1.6( రూ.14.65 కోట్లు) మిలియన్ డాలర్లు దక్కనుండగా.. సెమీ ఫైనల్‌లో ఓడిన జట్లకు 7,90,000 డాలర్ల(రూ.7.24 కోట్లు) ప్రైజ్‌మనీ లభించనుంది. సూపర్-8 చేరిన జట్లకు 380,000(రూ.3.48 కోట్లు) డాటర్లు, గ్రూప్ స్టేజ్‌లో జట్లకు 250,000(రూ.2.29 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కనుంది. ఈ ప్రైజ్‌మనీ మొత్తం ఆటగాళ్లకు కాకుండా ఆయా దేశాల క్రికెట్ బోర్డుకు ఐసీసీ అందజేయనుంది. అయితే బీసీసీఐ ఈ ప్రైజ్‌మనీతో కలిపి విజేతగా నిలిచిన భారత జట్టుకు భారీ నజరానా ప్రకటించే అవకాశం ఉంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 125 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించింది. ఇందులో ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు ఇవ్వగా.. రిజర్వ్ ప్లేయర్స్‌కు రూ. కోటి నజరానా అందజేశారు.

# గంభీర్ నవ్వుపై చమత్కరిస్తూ ధోనీ అభినందన

భారత క్రికెట్ అభిమానులకు ఇది డబుల్ ధమాకా. ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి టీమిండియా విశ్వవిజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చారిత్రాత్మక గెలుపు ఒక ఎత్తైతే.. టీమిండియా ఇద్దరు దిగ్గజాలు, మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మధ్య జరిగిన ఒక ఆసక్తికరమైన సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. వీరిద్దరి మధ్య పడదని, మనస్పర్థలు ఉన్నాయని గత కొన్నేళ్లుగా వస్తున్న వార్తలకు ఈ ఒక్క ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చెక్ పెట్టింది. భారత్ వరల్డ్ కప్ గెలవగానే ఎంఎస్ ధోనీ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టీమిండియాకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పోస్ట్ పెట్టాడు. అందులో ధోనీ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి చాలా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. నేరుగా పేరు చెప్పనప్పటికీ.. “కోచ్ సాబ్.. మీ ముఖం మీద నవ్వు చాలా బాగుంది. ఆ చిరునవ్వుతో కూడిన గాంభీర్యం కలయిక అద్భుతం!” అంటూ ధోనీ చమత్కరించాడు. గంభీర్ సాధారణంగా సీరియస్‌గా ఉంటాడనే విషయాన్ని ధోనీ తనదైన శైలిలో గుర్తు చేస్తూ అభినందించడం అభిమానులను ఖుషీ చేసింది. ధోనీ పెట్టిన ఈ పోస్ట్‌కు గౌతమ్ గంభీర్ వెంటనే స్పందించాడు. “నవ్వడానికి ఇంతకంటే మంచి



కారణం ఏముంటుంది మిమ్మల్ని చూడటం చాలా ఆనందంగా ఉంది!” అంటూ గంభీర్ రిప్లై ఇచ్చాడు. గంభీర్ చేసిన ఈ కామెంట్ కేవలం 3 గంటల్లోనే 60 వేలకు పైగా లైకులను సొంతం చేసుకుంది. వీరిద్దరి మధ్య ఉన్న ఈ స్వీట్ మూమెంట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. “మేము చూడాల్సింది ఇదే.. వరల్డ్ కప్ గెలుపు మాకు ఈ అద్భుతమైన క్షణాన్ని బహుమతిగా ఇచ్చింది” అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తుతున్నారు. భారత జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది. వైట్ బాల్ క్రికెట్‌లో గంభీర్ కోచింగ్ టీమిండియాకు బాగా అ కలిసి వచ్చింది. గంభీర్ సారథ్యంలో భారత్ ఇప్పటికే 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఇప్పుడు తాజాగా 2026 టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకుని గంభీర్ తన కోచింగ్ పవర్‌ను నిరూపించుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు వెరసి భారత్ ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందుతోంది.

PCW తెలుగు దినపత్రిక



# అమెరికాలో 'ఉస్తాద్' ఫీవర్..

## విడుదలకు ముందే రికార్డు వసూళ్లు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్‌లో తన సత్తా చాటుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 50 వేల డాలర్లకు (భారత కరెన్సీలో సుమారు రూ. 41 లక్షలు) పైగా గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పుంజుకుంటాయని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు విదేశాల్లో ఉన్న బలమైన ఫ్యాన్ బేస్, అలాగే హరీశ్ శంకర్‌తో ఆయన కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా ఉండటంతో ఈ క్రేజ్ ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, నార్త్ అమెరికా మార్కెట్‌లో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇద్దరు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వీరిద్దరి సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పవన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా హరీశ్ శంకర్ ఈ సినిమాను పవర్-ప్యాక్డ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో తీర్చిదిద్దుతున్నారు. 'ఓజీ' వంటి భారీ చిత్రం తర్వాత పవన్ కల్యాణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు పది రోజుల ముందే ఓవర్సీస్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం చూసి, సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనాలు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ నిర్మాత వల్ల నెల రోజులు ఖాళీగా ఉన్నా...



బాలీవుడ్ నటి ఆదా శర్మ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని అభిమానులతో పంచుకున్నారు. డేట్స్ సర్దుబాటు చేసే క్రమంలో ఓ నిర్మాత తన మేనేజర్‌ను బూతులు తిట్టారని, ఆ నిర్మాత తీరు వల్ల తాను నెల రోజుల పాటు ఎలాంటి పని లేకుండా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు.
తాను ఒకే సమయంలో మూడు సినిమాలకు అంగీకరించానని, అయితే మొదటి సినిమా డేట్స్ పదే పదే మారడంతో మిగతా రెండు ప్రాజెక్టుల షెడ్యూల్స్‌కు ఇబ్బంది వచ్చిందని ఆదా తెలిపారు. అయినా సరే మొదటి సినిమా నిర్మాత తనకు ఆ పలానా తేదీలే కావాలని పట్టుబట్టారని, ఈ క్రమంలో తన మేనేజర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా ఇద్దరు దర్శకులు చాలా హుందాగా వ్యవహరించి తమ షూటింగ్ తేదీలను మార్చుకున్నారని ఆదా వివరించారు. మూడో సినిమా నిర్మాత అయితే తనకోసం ఏకంగా ఇతర నటీనటుల డేట్స్ కూడా అడ్జస్ట్ చేశారన్నారు. "ఇండస్ట్రీలో చెడ్డవాళ్లే కాదు, మంచివాళ్లు కూడా ఉన్నారని చెప్పడానికే ఈ విషయం చెబుతున్నా" అని ఆమె అన్నారు. అయితే, అందరూ సర్దుబాటు చేసుకున్నాక, మొదటి సినిమా నిర్మాత మాత్రం తనకు ఇప్పుడు ఆ డేట్స్ వద్దని చెప్పడంతో తాను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నానని ఆదా వాపోయారు. ఇదే సమయంలో 'ది కేరళ స్టోరీ' సీక్వెల్‌లో తాను ఎందుకు నటించడం లేదన్న దానిపై కూడా ఆదా శర్మ స్పందించారు. తాను భాగం కాని సినిమా గురించి వార్తల్లో నిలవడం కోసం మాట్లాడటం సరికాదన్నారు. తనకు సీక్వెల్‌లో అవకాశం వచ్చిందా లేదా అనేది మేకర్స్, తన మధ్య ఉండాల్సిన విషయమని స్పష్టం చేశారు. మొదటి భాగం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐసిస్ క్యాంపుల నేపథ్యంలో సాగితే, రెండో భాగం పూర్తిగా భిన్నమైన కథ అని ఆమె తెలిపారు.



# మైక్ దొరికితే తెలివి పెరగదు..

## పార్థిబన్‌కు త్రిష స్ట్రాంగ్ కౌంటర్!

ప్రముఖ నటుడు ఆర్. పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఘాటుగా స్పందించారు. మైక్రోఫోన్ చేతికి దొరికినంత మాత్రాన మాట్లాడే మాటల్లో తెలివి ఉండదని, అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుందని ఆమె చురకలంటించారు. ఇటీవల ఒక అవార్డుల కార్యక్రమంలో త్రిషను ఉద్దేశించి పార్థిబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపాయి.



### అసలేం జరిగింది?

ఇటీవల జరిగిన గలాటా అవార్డ్స్ కార్యక్రమంలో గతంలో తను కలిసి పనిచేసిన నటీనటులపై అభిప్రాయం చెప్పాలని పార్థిబన్‌ను కోరారు. ఈ క్రమంలో తెరపై త్రిష ఫొటో కనిపించగానే, ఆయన ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి. బయటకు రాకుండా చూసుకోవాలి. అదే మంచిది" అని అన్నారు. ఇటీవల నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి త్రిష ఒక వివాహ వేడుకలో కనిపించిన నేపథ్యంలో పార్థిబన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### ఘాటుగా స్పందించిన త్రిష

ఈ వివాదంపై త్రిష తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా గట్టిగా బదులిచ్చారు. "ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో ఒక వ్యక్తి తన అసిస్టెంట్ ద్వారా చెప్పించి చివరి నిమిషంలో నా పేరు, ఫొటో చేర్చారని ఆర్గనైజర్లు నాకు తెలిపారు" అని ఆమె వెల్లడించారు. "చేతిలో మైక్ ఉన్నంత మాత్రాన మాట్లాడే మాటలు తెలివైనవిగా లేదా హాస్యంగా ఉండవు. అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుంది. అవగాహన లేకుండా మాట్లాడే అసభ్యకరమైన మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో వారి కంటే, మాట్లాడిన వ్యక్తి గురించే ఎక్కువ చెబుతాయి" అని ఆమె పోస్ట్ చేశారు. త్రిష స్పందనకు నెటిజన్ల నుంచి మద్దతు లభించింది.

### క్షమాపణ చెప్పిన పార్థిబన్

తన వ్యాఖ్యలపై వివాదం ముదరడంతో నటుడు పార్థిబన్ దిగివచ్చారు. ఈ నెల 8న తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు. త్రిషను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది. అయితే, సహనటిపై సీనియర్ నటుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఫన్ ర్యాప్ సాంగ్

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్- డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫన్ ఫిల్ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా సినిమాకు సంబంధించిన ఫన్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా సటైరికల్ టోన్‌ను అద్భుతంగా చూపిస్తోంది. ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం2026 వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. 'కశ్యప్ శ్రీనివాస్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అసలైన హీరో ఈ సినిమాకి ఆయన, ఆయన కథ. కష్టపడ్డ సింహం ఆయన. అదృష్టమైన సింహాన్ని నేను. తప్పకుండా ఈ సినిమాని ఫ్రెండ్స్‌తో ఫ్యామిలీతో కలిసి చూడండి' అని అన్నారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాని మా డైరెక్టర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా తీశాడు. సినిమా చాలా బాగా వచ్చింది' అని పేర్కొన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరిని ఎంటర్‌టైన్ చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ అసుర పాల్గొన్నారు.

# విజయ్ సినిమాకు మరో షాక్.. రిలీజ్ మరింత లేటుగా..

రాజకీయాలపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు తమిళ స్టార్ హీరో విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అయితే చివరిగా ఆయన నటించిన చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల కావాల్సింది. కానీ, అనుకోని అడ్డంకులు ఏర్పడి సినిమా విడుదల ఆగిపోయింది. ప్రస్తుతం ఈ సినిమా విడుదల కేసు కోర్టులో ఉంది. ఈ సినిమాను రివైజింగ్ కమిటీ వీక్షించాలి. కానీ, కమిటీలో ఒక సభ్యుడు అనారోగ్యం కారణంగా సినిమా స్క్రీనింగ్ చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో సినిమా రిలీజ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అన్ని సమస్యలు తీరితే సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేద్దామని భావించారు. కానీ, అది జరగలేదు. ఆ తర్వాత ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇంకా రివ్యూ కమిటీ వీక్షించి రిపోర్ట్ ఇస్తే.. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుంది. కానీ, అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. దీంతో ఏప్రిల్‌లో కూడా సినిమా రిలీజ్ అయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు విజయ్ పుట్టిన రోజు నాడు దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

